## అతని కథ

'ఎక్స్‌ప్రెస్ గంట లేటు' అని వ్రాసి ఉన్న బోర్డు చూచుకొని 'హమ్మయ్య' అంటూ ఊపిరి పీల్చుకున్నాడు ఆనందరావు. ముఖం మీద స్వేద బిందువుల్ని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ ప్లాటుఫారంలో వున్న ఓ బల్లమీద చతికిల పడ్డాడు. అతన్ని చూడగానే బండి టైమ్ అయిపోయిందని హడావిడి పడుతూ పరుగెత్తుకొచ్చాడని ఇట్టే తెలిసిపోతుంది. బండి లేటు అనే బోర్డు చూడగానే అతని ముఖం కొంచెం వికసించింది.

బెంచీమీద తాపీగా కూర్చొని జేబులోనుంచి ఓ ఉత్తరం తీసి చదవడం ప్రారంభించాడు.

ప్రియమైన ఆనందశ్రీగారికి :

నమస్కారములు, ఈ ఉత్తరంచూస్తే మీకు చాలా ఆశ్చర్యం కలగొచ్చు. నేనెవర్నో మీకు తెలియకపోయినా మీరు నాకు చిరపరిచితులే. మీ కథలంటే నాకెంతో ఇష్టం. ముఖ్యంగా ఈ మధ్య పబ్లిషయిన మీ 'కొత్తకథ' నన్ను ఈ ఉత్తరం రాయడానికి ప్రేరేపించింది. సరిగ్గా నా కథలాగే వుంది. మీ కథలోని కథానాయకిలాగానే మీకథలు చదివినప్పటినుంచీ "మీరు ఇలా ఉంటారు, అలా

ఉంటారు, ఇలా మాట్లాడతారు అలా నడుస్తారు," అని ఎన్నో ఊహాగానాలు చేస్తున్నాను. మీకు ఎన్నో రోజులుగా ఉత్తరాలు రాయాలనుకుంటూ ధైర్యం చాలక రాయ లేక పోయాను. మీ కథ చదివి ఈ ఉత్తరం రాయడమే కాదు; మీ దర్శనం చేసుకోవాలని కోర్కె కూడా కలిగింది. నేను ఇక్కడ ఒక బాంకిలో పని చేస్తున్నాను. వివరాలు సమక్షంలో తెలియబరచగలను.

రేపు సాయంత్రము గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ లో వస్తున్నాను. నల్లంచు పచ్చ జార్జెట్ చీర కట్టుకొని ఉంటాను. మీ స్టేషన్‌కు వస్తారు కదూ ?

ఇట్లు
మీ దర్శనాభిలాషిణి
సుభాషిణి.

ఉత్తరం చదువుకొని ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ జేబులో పెట్టుకున్నాడు.

నేటికి తన సాధన ఫలించింది. తను కథలు బాగా రాయగలననే నమ్మకం ఎప్పుడో కలిగింది. కానీ ఇంత బాగా రాయగలనని తనకు ఇప్పుడే అర్థమయింది. తను కథ అల్లిన కథ నిజం కాబోతున్నది. తన కథానాయకి కథకుణ్ణి గురించి ఎన్ని ఊహాలు అల్లుకుంది ? ఎన్ని రాత్రిళ్లు ఆ మధుర కల్పనా తరంగాలలో ఉక్కిరి బిక్కిరయింది ? 'మీ కథానాయికలాగనే నేనుకూడ' అంటే అంటే.... ఆనందపుటలను అనందరావు (అయన పెన్

నేమ్ ఆనంద (శ్రీ) హృదయంలో ఉవ్వెత్తుగా లేచి పడుతున్నాయి.

ఆ జానకికి గర్వభంగం చేస్తాను! ఆమెకు ఎంత గర్వం? తనను ఒక మనిషిగా కూడా చూడదు. ఇక తన కథలను గురించి ఆమె అభిప్రాయం వింటుంటే అమాంతంగా ఎక్కడికో లోతు తెలియని అగాధాల్లోకి పడిపోతున్నట్లుంటుంది. అంత అవమాన పర్చినా తను ఓపికతో ఆమెను కలుసుకుంటూనే ఉన్నాడు. ఎప్పటి కయినా తన గొప్పతనాన్ని గ్రహించే వివేకం ఆమెకు కలగకపోతుందా అనే తన నమ్మకం. ఈ ఉత్తరం రాగానే తను మొదట చేసిన పని జానకి దగ్గరికి పరుగెత్తుకెళ్ళి చూపించడం. ఈ దెబ్బతో చిత్తయి పోతుందనుకున్నాడు. ఆడవాళ్ళు ఇతరులను ఎంత ఇష్టపడతారో అంత ఇష్టం లేనట్లూ నటిస్తారని తనకు తెలుసు.

ఆ ఉత్తరం చూడగానే, జానకి ముఖం నల్లబడి పోతుందనుకొన్నాడు; ఈర్ష్యతో ఎత్తిపొడుపు మాట లంటుందనుకున్నాడు. అబ్బే! చదివినంత సేపు వచ్చే నవ్వును పండ్లతో కింది పెదవిని నొక్కుతూ ఆపుకోవడం తను గమనించకపోలేదు. అంతా చదివి ఎంత పెద్దగా నవ్వింది! ఆ క్షణంలో ఆమె గొంతు నులిమేద్దామా అనిపించింది తనకు. ఏమిటా వెకిలి నవ్వు! అందుకే ఆడవాళ్ళను ఇంట్లో పడేసి ఉంచాలన్నారు. ఈ చదువులూ, ఉద్యోగాలూ, వాళ్ళకు ఎంతమాత్రం పనికి రావు. అని అనుకుంటూ కోపంగా లేచిన తనకు "అయ్యో! ఉత్తరం ఇక్కడే వదిలేసి పోతున్నారే. పాపం." అన్న

మాటలు ములుకుల్లా గుచ్చుకున్నాయి. ఆమె చేతిలోని ఉత్తరాన్ని గుంజుకొని విసురుగా వచ్చేశాడు.

రాత్రంతా ఒకవైపు తనకు జానకి కలిగించిన పరాభవం; సుభాషిణిని గురించిన తియ్యని తలపులతో గడిచి పోయింది. ఏమయినా జానకిని మాత్రం తను పరాభవించకుండా వదలడు. సుభాషిణి - పేరు ఎంత బాగుంది? బాంకిలో ఉద్యోగం అంటే ఎంత లేదన్నా జానకికంటే ఎక్కువే ఉంటుంది జీతం. చదువు కూడా ఎక్కువే ఉండొచ్చు. అందంలో చెప్పుకోదగ్గ విశేష మేమీ జానకిలో లేదు. సుభాషిణి పేరుతో ఉన్న తన వెడ్డింగ్ కార్డు జానకికి ఇచ్చి చూపులతోనే ఆమె గర్వ భంగం చెయ్యగలడు.

చేతి గడియారం చూచుకున్నాడు ఆనందరావు. ఇంకా అర్ధగంట టైము ఉంది. మళ్ళీ ఆలోచనలు ఈగ ల్లాగా ముసురుకున్నాయి.

ఆమె మొదటి పరిచయంలో ఏంమాట్లాడాలి, ఎలా మాట్లాడాలి? తన్ను చూడగానే బహుశా తన ఊహా లన్నీ, ఆశలన్నీ పక్షుల్లా ఎగిరిపోవచ్చును. తన అందంలో వికారం ఏమీ లేకపోయినా ఆకర్షించగల విశేషత ఏమీ లేదని తన ఈ ముప్ఫయ్ సంవత్సరాల అనుభవమే చెబు తోంది. జానకిలాగా కేవలం అందం చూచి, భ్రమిసే వ్యక్తి కాదు సుభాషిణి. వ్యక్తిలోని విశిష్టతనూ, గొప్ప తనాన్ని అర్థంచేసుకోగల వివేకవంతురాలులాగానేఉంది. కాబట్టి తను తన సంభాషణా కౌశలంతో తన రూపాన్ని

మరుగుపరచాలి. స్త్రీ పురుషులలోని అందంకంటే తెలివి తేటలకూ, సంభాషణా కుశలతకూ ఎక్కువ ఆకర్షింప బడుతుందని తను ఎక్కడో చదివాడు.

'ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ది బెస్ట్ ఇంప్రెషన్' అన్నారు. మొదటి పరిచయంలో స్త్రీ హృదయంమీద పడిన చిత్రాన్ని తుడిచే రబ్బర్ యూరప్ వాళ్ళు ఇంకా కనిపెట్టలేదు. ఎంతో జాగ్రత్తగా, మాట్లాడబోయే ముందు ఆ శబ్దాలను కనీసం పది సార్లయినా మన సులో వల్లించుకొని మరీ ఉపయోగించాలి. అప్పుడు గాని ఆ శబ్దాల అర్థం తనకు స్పష్టంగా బోధ పడదు. మన తెలివితేటలు మనం ఉపయోగించే శబ్దాలలో చాలా వరకు బయటపడతాయి. ఎంతోమంది పురుషులు స్త్రీలను అర్థం చేసుకోలేక ధక్కా ముక్కీలు తినడం కూడా ఇందువల్లనే. కొద్ది పొరపాటు కారణంగానే ఒకడు స్త్రీముందు పశువయితే, ఇంకొకడు పిరికిపంద అవుతాడు.

అందులో తను కథకుడాయె! అందువల్ల ఇంకా జాగ్రత్తగా, ఒక్కొక్క మాటను తూచి తూచి మరీ వెయ్యాలి. తను ఎన్నో కిరసనాయిల్ డబ్బాలు ఖర్చు చేసి ఎన్నో రాత్రిళ్ళు చదివిన ఎన్నో పుస్తకాల చదు వంతా ఆ పొగరుబోతు జానకి దగ్గర వ్యర్థం అయింది. తను ఏది మాట్లాడినా వాజమ్మకింద జమ కట్టేది. ఆ కళను ఉపయోగించే సదవకాశం లభించింది.

ఎలాంటి తొందరపాటుగానీ చూపించ కూడదు. స్వయంగా ఉత్తరం రాసి వచ్చి కలుసుకొనే ఆ పిల్ల

ఎంత ధైర్యసాహసాలు కలిగినదో వేరేచెప్పనవసరంలేదు. కాని ఛీ! ఎంత నిభాయించుకుందామనుకున్నా హృదయస్పందనం కొంచెం తీవ్రంగానే ఉంది. దూరంనుంచి కెనేడియన్ ఇంజన్ కూతవినిపించి ఉలిక్కిపడి లేచి నిల్చున్నాడు ఆనందరావు. హృదయంలో కూడా ఏదో ఇంజన్‌లాంటిదే రొద చేస్తున్నట్లుంది. గుండె వేగం హెచ్చింది.

ఏం మాట్లాడాలి? ఇంతసేపు ఆలోచించినా ఒక్క శబ్దంకూడా తోచలేదు తనకు. మొదటి సంభాషణలో వినమ్రతా, మర్యాదా ఉట్టిపడుతుండాలి కాని ప్రేమ పైత్యం కన్పించకూడదు. సంభాషణను అతి నిగ్రహంతో నేర్పుగా నిర్వహించాలి. అది ఎలాగనేది ఏ పుస్తకంలోనూ, ఏ ఒక్క వెధవ మచ్చుకైనా నాల్గుమాట లివ్వలేదు. ఎన్ని పుస్తకాలు వ్రాసి ఏం లాభం?

కళ్ళముందునుంచి ఇంజను ఒక్కొక్క పెట్టెను లాక్కొని వెళ్ళిపోతున్నది. బండి ఆగింది. ఒక్కొక్క పెట్టె దగ్గరకూ పరుగెత్తాడు ఆనందరావు. సెకండ్ క్లాస్ కంపార్టుమెంటు తలుపు దగ్గర ఓ నవయువతి నల్లంచు పచ్చ చీరెతో నిల్చొని ఉంది. ఆనందరావు కళ్ళలోకి ఓ కాంతి కిరణం దూసుకపోయింది.

పచ్చనిదబ్బపండులాంటి శరీరం. పెద్దపెద్దకళ్ళతో ఆదుర్దాగా ఎవర్నో వెతుకుతున్నది. వెనుకనుంచి అంత అందమైన యువతిని అధునాతన వేషంలో చూచిన

ఆనందరావుకు చెమట్లు పోశాయి. ఆమెముందు తను ఎలక్ట్రిక్ లైటు ముందు కిరసనాయిలు బుడ్డిలా ఉంటాడు. తన ముతక దోవతీ, ఖద్దరు లాల్చీ, తన రూపం చూచి ఆమె ఏమనుకుంటుందో! ఒక క్షణంపాటు తిరిగి వెళ్ళి పోవాలనీ, గుట్టుచక్కగా పోయి రూములో తలుపులు బిగించుకొని కూర్చోవాలనీ అనిపించింది. అప్రయత్నంగా ఆ వైపు మళ్ళీ కళ్ళు తిరిగాయి. ఆమె ఆ పెద్దపెద్ద కళ్ళలోని నిరాశ గూడుకట్టుకొని పోతున్నది. తన తెలివి తక్కువకు సిగ్గుపడ్డాడు. ఆమె తన అందాన్ని చూడాలని కాదు, తనలోని కథకుణ్ణి చూడాలనే వస్తున్నది. ఆమెకు కావాలంటే అందమైన యువకులు దొరక్క తనను గురించి కలలు కన్నదా? తను నిజంగానే పిరికి పంద. అరే! నిరాశతో ఆమె ముఖం ఎంత కాంతి హీనంగా ఉంది! తను ఇక ఆలస్యం చేయకూడదు.

గబగబా ముందుకు సాగాడు ఆనందరావు. ఆమె తనవైపే చూస్తున్నది. అరే ఆ ముకుళించుకున్న పద్మం చిన్నగా ఎలా వికసించింది! ఒక్క దూకులో వెయ్యేనుగుల బలంతో ముందుకు పోయి చిరునవ్వుతో నమస్కారం చేశాడు. ఆమె తెల్లపోయింది! ముఖం చిట్లించుకుంటూ పక్కకు తిప్పుకుంది! ఇంతలో తన వెనక నుంచి "హాల్లో! పద్మా క్షమించు! ఆలస్యమయింది." అన్న మాటలు విని ఉలిక్కిపడి వెనక్కు చూశాడు ఆనందరావు. ఫులెన్ సూట్‌లో ఓ పొడుగాటి అందమైన యువకుడు తన్ను నెట్టుకుంటూ ప్లాట్ఫారంలోకి

ఎక్కాడు. ఎంతఅవమానం! ఆవిడతనవంక ఎంత ఏవగింపుగా చూసింది!

ఆనందరావు గాబరాగాబతుకుజీవుడా అనుకుంటూ స్టేషన్ బయటపడ్డాడు. ఇక ఏ పెట్టెలోనూ వెతికే ధైర్యం లేకపోయింది.

సరిగా తెలుసుకోకుండా త్వరపడినందుకు తనను తనే నిందించుకున్నాడు. ఆ రాసేది ఇంకాకొంచెం వివరంగా రాయకూడదూ? ఒక చీర రంగు చెప్పగానే సరిపోతుందా? ఇక ఇలా కాదనుకొని టికెట్ కలెక్టర్ గేటుకు కొంచెం దూరంగా నిల్చొని చూస్తున్నాడు. ఒక్కొక్కరే వెళ్ళిపోతున్నారు. ఒక నల్లంచు పచ్చచీరకూడా కన్పించదే? అంతా వెళ్లిపోయారు.

తనను ఏడిపించడానికే ఎవరో ఇలా రాసి ఉంటారు అసలు కొంటెజానకే రాసిందేమో? అందుకేనేమో అంత నవ్వు! ఈ ఆడవాళ్లు ఎంత కయినా తగిపోతారు.

నిరాశా హృదయంతో, అవమానంతో, భారంగ బయటికొస్తున్న అతని కళ్లకు ఓ నల్లంచు పచ్చచీర కన్పించింది. ఒక అమ్మాయి చేతులో సూట్‌కేసుతో అటు తిరిగి నిల్చొని ఉంది. ఆమే అయిఉంటుంది. ఆనందరావు అలాగే నిలబడి చూస్తున్నాడు. ఎంతలావుగా ఉంది! జబ్బలు తెల్ల

జాకెట్‌లోనుండి ఎంత నల్లిగా నిగనిగలాడుతూ కన్పిస్తు న్నాయి! ఆనందరావుకు తను కట్టుకున్న ఆశాసౌధాలు ఒక్కటొక్కటే కూలిపోతున్న ట్లనిపించింది. పలక్కుండా వెళ్లిపోవాలనుకున్నాడు. కాని ఆమె పెట్టె చేత్తో పట్టు కొని తనకొరకు ఎదురుచూడడం ఆలోచిస్తే జాలి కలిగింది. కొంచెం లావయితే మాత్రమేం! తను మాత్రం అంత అందంగా ఉన్నాడా ఏం ? పుల్లలా వుండే ఆడ వాళ్ళేం బాగుంటారు ?

గబగబా వెళ్ళి 'నమస్కారం అండీ' అన్నాడు. ఆమె హంటర్ దెబ్బ తగిలిందానికి మల్లే ఉలిక్కిపడి గిరుక్కున తిరిగింది. ఆమె ముఖం చూచిన ఆనందరావుకు చెమట్లు పట్టాయి.

"మీరేనా ఆనందశ్రీగారు?" అన్నది తన చిన్న చిన్న తెల్లని కళ్ళను మెరిపిస్తూ.

"కాదండీ! నా పేరు ఆనందశ్రీ.... కాదు.... కాదు.

"ఇదిగో చూడండి" అని ఏదో అడగబోతున్న ఆమె వైపు చూడకుండానే గబగబా ముందుకు నడచి పోయాడు ఆనందరావు.

♦ ♦ ♦ ♦

రెండోరోజు మధ్యాహ్నం ఆనందరావు జానకి ఇంటి కెళ్లాడు. ఆమెకు ఎలా కథ అల్లి చెబితే ఈర్ష్యా కోపం కలుగుతాయో రాత్రంతా ఆలోచించుకున్నాడు. తనకు జరిగిన పరాభవం తాలూకు ఛాయలు ఏమాత్రమూ బయటపడనివ్వకూడదనుకున్నాడు, అసలే ఆ జానక్కి తనంటే లోకువ. ఎంత మాటైనా ఇట్టే అనేస్తుంది. మహా గర్వి.

"నమస్కారం! రండి. కూర్చోండి. మీ గురించే ఆలోచిస్తున్నాను." జానకి ఉత్సాహం ఆనందరావును ఆశ్చర్యపరిచింది.

అందులో అంతర్యం తనకు తెలియక పోలేదులే అనుకున్నట్లు ఓ చిరునవ్వు విసిరి గంభీరంగా కుర్చీలో కూర్చున్నాడు. నొసలు ముడిచి దీర్ఘంగా ఆలోచిస్తు న్నాడు. చేతిలోని సిగరెట్టు దమ్ములు చాల గట్టిగా పీలుస్తున్నాడు.

"సుభాషిణి వచ్చిందా ? ఎలా వుంది.?"

"ఊఁ చాలా బాగుంది." అన్నాడు. అదే గంభీ రమైన గొంతులో ఆమె కళ్ళలో దేన్నో వెతుకుతూ కాని అతనికి ఆమె కళ్ళలో ఏమీ దొరకలేదు.

"చాలా అందమైన పిల్లా చురుకైనదీనూ, సన్నగా నాజూగ్గా ఉంటుంది. నిన్నను తీరకనే రాలేదు. నేనంటే ప్రాణం. నా కథల్ని ఎంత పొగిడేసిం దనుకున్నావ్ ? ఇవ్వాళ పొద్దున్నే బండి ఎక్కించి వచ్చాను."

జానకి వచ్చే నవ్వును ఆపుకో ప్రయత్నిస్తున్నది.

"ఏం! నేను చెప్పేది అబద్ధం అనుకుంటున్నావా ?"

"అబద్ధం కాదు, పాపం మీ పరిస్థితి చూస్తుంటే నవ్వొస్తుంది. నిన్న గుంటూరు నుంచి మా ఫ్రెండ్ ఒకామె వచ్చింది. ఆమెకు మీ కథలంటే చాలా ఇష్టం. మీతో పరిచయం చేయమని నిన్నటినుంచి నా ప్రాణం తీస్తున్నది." అన్నది జానకి.

ఆనందరావు మోడువారుతున్న హృదయంలో కొత్తచిగుళ్ళు అంకురించాయి. హృదయంలో తీవ్రంగా స్పందిస్తున్నది. ఈ హృదయం చాలా చెడ్డది. అందులో కథకుల కవుల హృదయాలు చిన్న గాలివాటుకుకూడా స్పందిస్తాయి; ముఖం బిగబట్టి సిగరెట్టు దమ్ములాగేశాడు.

'బేబీ యిలా రా' అని పిలిచింది జానకి.

ఆనందరావు కళ్ళు కూతూహలంతో వాకిలివైపు తిరిగాయి. వస్తూవస్తూ తన్ను చూచి గడపలో ఆశ్చర్యంతో నిలబడిపోయిన సుభాషిణిని చూచిన ఆనందరావుకు తను కూర్చున్న కుర్చీ ఎక్కడికో పాతాళలోకానికి కుంగి పోతున్నట్లనిపించింది.

దిగ్గున లేచి "వస్తా! వస్తా! కొంచెం పనివుంది" అంటూ ఆ ఏడు మెట్లను రెండు అడుగుల్లో దాటి రోడ్డుమీద పడ్డాడు. ఎక్కడనుంచో దుఃఖం పొర్లుకొస్తోన్నది.

అంతే; ఆ రోజునుంచి ఈ రోజువరకు మైలాపూరు బస్ ఎక్కలేదు ఆనందరావు. తనకు ఆడవాళ్ళంటే అసహ్యమనీ, ఆడవాళ్ళకు బుర్రింటూ ఉండదనీ అంటూ ఉంటాడు స్నేహితులతో ఆనందరావు.